సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 4 । జనవరి । 2024



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.



భోజనం.. రుచికరం

ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు మెరుగైన మెనూతో రుచికరమైన భోజనం అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు, కడుపునిండా తింటున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
31.1°/17.2°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చలి తీవ్రత బాగా పెరిగింది. తూర్పు దిశగా గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

గవర్నర్ పర్యటన షెడ్యూల్ ఖరారు

అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఈ నెల ఆరో తేదీన నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్/ యూనివర్సిటీల చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

- ఆదివారం ఉదయం 7 గంటలకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గం ద్వారా బయల్దేరుతారు.
- 8:30 గంటలకు శ్రీ సత్యసాయి జిల్లా సరిహద్దులోని కొడికొండ చెక్ పోస్టు వద్ద గల రక్షా అకాడమీకి చేరుకుంటారు.
- 8:30 నుంచి 8:50 గంటల వరకు అక్కడే ఉంటారు.
- 8:50 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి రోడ్డు మార్గం ద్వారా అనంతపురం జేఎన్‌టీయూకు 10:20 గంటలకు చేరుకుంటారు.
- 10:40 గంటలకు స్నాతకోత్సవంలో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 12:45 గంటలకు అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుని, అక్కడే భోజనం చేస్తారు.
- 2 గంటలకు బుక్కరాయసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సభావేదిక వద్దకు చేరుకుంటారు.
- సాయంత్రం 3:45 నిమిషాలకు అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు.
- 4:30 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం బెంగళూరుకు రోడ్డు మార్గం ద్వారా వెళ్లనున్నారు.

జేఎన్‌టీయూలో పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: రాష్ట్ర గవర్నర్ షేక్ అబ్దుల్ నజీర్ ఈ నెల 6న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జేఎన్‌టీయూలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ గౌతమి బుధవారం పరిశీలించారు. ఆడిటోరియంలో జరిగే జేఎన్‌టీయూ స్నాతకోత్సవ కార్యక్రమాల్లో గవర్నర్ పాల్గొంటారన్నారు. అక్కడ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రొటోకాల్ విషయంలో విమర్శలకు తావు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. జేఎన్‌టీయూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ఆడిటోరియంలో సీటింగ్ ఏర్పాట్లు, వచ్చిన వారందరికీ తాగునీటి వసతి, భోజనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అతిథి గృహాలను సైతం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట ఆర్డీఓలు గ్రంధి వెంకటేశ్, శ్రీనివాసులరెడ్డి, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రిజిస్ట్రార్ శశిధర్, తహసీల్దార్ బాలకిషన్ తదితరులు ఉన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

- గత డిసెంబర్‌లో 159 కేసులు, 131 మంది అరెస్ట్



పట్టుబడిన మద్యం చూపుతున్న సెబ్ పోలీసులు (ఫైల్)

పుట్టపర్తి టౌన్: అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. అడిషనల్ ఎస్పీ విష్ణు పర్యవేక్షణలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మద్యం, ఇసుక, నాటుసార స్థావరాలపై దాడులు నిర్వహించారు. డిసెంబర్ నెలలో 7,288 కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. 131 మందిని అరెస్ట్ చేసి 159 కేసులు నమోదు చేశారు. ఇక అక్రమంగా ఇసుక తరలిస్తున్న 22 మందిని అరెస్ట్ చేసి 22 వాహనాలు సీజ్ చేసి, 22 కేసులు నమోదు చేశారు. ఇక మాట్కా ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి 8 కేసులు నమోదు చేశారు. వీరివద్ద నుంచి రూ 63,150 నగదు సీజ్ చేశారు. నాటు సారా స్థావరాలపై కూడా దాడులు పెంచారు. డిసెంబర్ నెలలో 102 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా మద్యం, ఇసుక అక్రమ రవాణా, నిల్వలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. మద్యం అక్రమంగా తరలించినా, నిల్వలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూడువేల కాంతులు

- ఇచ్చిన మాట మేరకు పింఛన్ మొత్తం రూ.3 వేలు చేసిన జగన్
- పెరిగిన పింఛన్ అందుకుని మురిసిపోయిన అవ్వాతాతలు
- జిల్లాలో కొత్తగా మంజూరైన 3,309 పింఛన్ల అందజేత
- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు



పింఛన్ లబ్ధిదారుడికి రూ.3 వేలు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: పింఛన్‌దారుల మోముల్లో మూడు వేల కాంతులు కనిపించాయి. ఏ ఆసరా లేని వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు 'వైఎస్సార్ పింఛన్ కానుక' పేరుతో ఇచ్చే సామాజిక భద్రత పింఛన్ మొత్తం రూ.3 వేలకు పెరగడంతో వారంతా సంతోషంలో మునిగిపోయారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం ఇస్తున్న రూ.2,750 మొత్తానికి రూ.250 కలిపి ఒక్కో పింఛన్‌దారునికి ఈనెల నుంచి రూ.3 వేల పింఛన్ అందిస్తుండగా వారంతా ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. బుధవారం కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో జరిగిన సభలో సీఎం వైఎస్ జగన్ పింఛన్ పెంపును లాంఛనంగా ప్రారంభించారు. స్థానికంగా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ అరుణ్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీపీఎం రామమోహన్, పెన్షన్ విభాగం ఏపీఎం శివమ్మతో కలిసి వైఎస్సార్ పెన్షన్ కానుక సంబరాలు నిర్వహించారు. పింఛన్ లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు వైఎస్సార్ పింఛన్ కానుక పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం పెంచిన పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు.

పింఛన్ పంపిణీకి రూ.82.06 కోట్లు

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తోందని, అర్హులంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నవరత్నాలలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటి వరకూ అందిస్తున్న పింఛన్ మొత్తానికి ఈనెల నుంచి రూ.250 పెంచి రూ.3 వేల పింఛన్ అందిస్తున్నామన్నారు. దీంతో జిల్లాలో పింఛన్ కోసం ఒక నెల బడ్జెట్ రూ.82.06 కోట్లకు పెరిగిందన్నారు. ఈ నెల 8వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే 'వైఎస్సార్ పింఛన్ కానుక' సంబరాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని 2,74,839 మంది లబ్ధిదారులకు ఈ నెల పింఛన్ అందనుందన్నారు. పాత పింఛన్లతో పాటు కొత్తగా పింఛన్ మంజూరైన 3,309 మందికి రూ.3 వేల చొప్పున పింఛన్ అందజేస్తామన్నారు.

నాటి జ్ఞాపకాలను తలచుకుంటే వణుకే

గత చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ పంపిణీ చేసే విధానాన్ని తలచుకుంటే వణుకు వస్తుందని రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి అన్నారు. అప్పటి ప్రభుత్వం ఇచ్చే రూ.1,000 పింఛన్ తీసుకోవాలంటే 1వ తేదీ తెల్లవారుజాము నుంచి 10 రోజుల పాటు ఎక్కడ పంపిణీ చేస్తారో తెలుసుకుని అక్కడికి వెళ్లి కాచుకోవాల్సి వచ్చేదన్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికే వలంటీర్ వెళ్లి పింఛన్ ఇచ్చి వస్తున్నారన్నారు. గత చేదు జ్ఞాపకాలు కావాలో... అన్నీ ఇంటికే వచ్చే పరిస్థితి రానున్న రోజుల్లోనూ కొనసాగాలో పింఛన్ దారులు ఒక్కసారి ఆలోచించాలన్నారు.

పేదల పక్షపాతి జగన్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.3 వేల పింఛన్ అందిస్తున్నారు. పక్షవాతంతో నా కాళ్లు చచ్చుపడ్డాయి. ఏ పనీ చేసుకోలేను. ఇటీవలే దరఖాస్తు చేసుకోగా పింఛన్ మంజూరు చేశారు. ఈరోజు రూ.3 వేల పింఛన్ అందించారు.

– చాకలి శ్రీధర్, జగరాజుపల్లి

కొత్తగా పింఛన్ అందుకున్నా



గత నెలలో పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. వలంటీర్ వచ్చి పింఛన్ మంజూరైందని చెప్పారు. బుధవారం పుట్టపర్తిలో నూతన పింఛన్ మొత్తం రూ.3 వేలు అందజేశారు. సీఎం వైఎస్ జగన్ రుణం తీర్చు కోలేనిది.

– గౌస్‌మోద్దీన్, పెదపల్లి

అన్నలా ఆదుకున్నారు



భర్తను కోల్పోయి పుట్టెడు కష్టాల్లో ఉన్న నన్ను జగన్ అన్నలా ఆదుకుంటున్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోగానే ఈ నెలలో రూ.3 వేల పింఛన్ ఇచ్చారు. ఆయన కలకాలం సీఎంగా ఉండాలి.

– సాయిలక్ష్మి, పుట్టపర్తి

పండువలా 'కానుక' పంపిణీ

- పింఛన్ కానుక సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు



ఓ లబ్ధిదారుడికి వృద్ధాప్య పింఛన్ మొత్తం రూ.3 వేలు అందిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



తలుపులలో నిర్వహించిన పింఛన్ సంబరాల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ తొలిరోజు బుధవారం జిల్లాలో పండువలా సాగింది. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి అందజేశారన్నారు. సంక్షేమ పథకాలు, వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ పది కాలాల పాటు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

- పుట్టపర్తి పట్టణంలోని సత్యమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొని పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులు వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పుట్టపర్తి రూరల్ మండలం లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేసే కార్యక్రమాన్ని పండువలా నిర్వహించారు. కార్యక్రమంలో వేలాది మంది లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- కదిరి నియోజకవర్గంలోని తలుపుల 1వ సచివాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు రూ.3 వేల చొప్పున పింఛన్ అందజేశారు. దీంతో వారంతా సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.
- హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి 1, 2 సచివాలయాల్లో వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త దీపిక లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేసి పింఛన్ కానుక పోస్టర్లను విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్ వెంట నడవాలని సూచించారు.



లేపాక్షిలో పింఛన్ కానుక పోస్టర్లు విడుదల చేస్తున్న సమన్వయకర్త దీపిక

నిరుపేదలకు ఆరోగ్యభాగ్యం

- రెండోరోజు జిల్లాలోని 8 ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- 1,350 మందికి ఓపీ సేవలు
- 239 మందికి కళ్లద్దాల పంపిణీ



ధర్మవరం మండలం కొత్తపేటలో ఓ మహిళకు వైద్యం అందిస్తున్న వైద్యురాలు

ప్రశాంతి నిలయం: ప్రజలందరికీ ఆరోగ్యభాగ్యం కల్పించడమే లక్ష్యంతో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా రెండోరోజు బుధవారం జిల్లాలోని 8 చోట్ల సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించారు. 16 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు, 8 మంది కంటి వైద్యులు, 8 మంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు. ఆయా శిబిరాల్లో 1,350 మందికి ఓపీ సేవలు అందించారు. 10 మందిని క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశారు. మరో 239 మందికి కంటి అద్దాలు అందజేశారు. పెనుకొండ అర్బన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి పాల్గొని ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. శిబిరాలకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రెఫరల్ కేసులను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అలాగే ఆరోగ్య సురక్ష శిబిరాల వద్ద వసతులు కల్పించాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులన్నీ కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులపై పోలింగ్ కేంద్రాల వారీగా 5వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులతో కలిసి ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, సహాయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ప్రతి అంశాన్నీ తెలుసుకోవాలి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల అధికారులు ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరియల్ అధికారులు కోసం సంబంధిత శాఖలో అధికారుల వివరాలను అందజేయాలన్నారు. అలాగే మైక్రో అబ్జర్వర్ల నియామకం కోసం వివిధ బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు, పోస్టాఫీసు సిబ్బంది, అధికారుల వివరాలు అందజేయాలన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. డబుల్ ఎంట్రీలు ఉండకుండా చూసే బాధ్యత తహసీల్దార్లు, ఆర్డీఓలపై ఉందన్నారు. ఓటరు గుర్తింపు కార్డులు ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలన్నారు. డూప్లికేట్ ఓట్లను ఒకటికి రెండు సార్లు పరిశీలించి నిబంధనల మేరకు తొలగించాలన్నారు. అనంతరం పలు అంశాలపై తగిన సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



సంగీత విభావరి నిర్వహిస్తున్న సిక్కిం సత్యసాయి భక్తులు

సిక్కిం భక్తుల గానామృతం



కార్యక్రమంలో పాల్గొన్న సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సిక్కిం సత్యసాయి భక్తులు రెండో రోజు బుధవారం సత్యసాయి సన్నిధిలో సంగీత విభావరి నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి భక్తిగీతాలు ఆలపించారు. సుమారు 500 మంది తమ గానామృతంతో భక్తులను మంత్ర ముగ్ధులను చేశారు. అనంతరం వారంతా సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

10న తలనీలాల వేలం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలకు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సర కాలపరిమితికి గాను ఖాద్రీ ఆలయంలో బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు రూ.30 లక్షలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 3 నెలల పాటు విద్యుత్ సామగ్రి, కరెంట్ వస్తువుల సరఫరా కోసం వేలం పాట నిర్వహిస్తున్నామని, ఆసక్తి గలవారు రూ.25 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలం పూర్తయిన తర్వాత పూర్తి మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి సమాచారం కోసం 9000490670 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉపాధిలో రికార్డు

- 'అనంత'లో డిసెంబరు నాటికి 93 లక్షల పని దినాలు
- శ్రీసత్యసాయి జిల్లాలో 65 లక్షలకు పైగా పని దినాలు
- ఏడాదిలో ఉపాధి కోసం రూ.497 కోట్లకు పైగా వ్యయం
- నగటు పనిదినాలు పెరగడంతో భారీగా తగ్గిన వలసలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉపాధి హామీ పనుల కల్పనలో ఉమ్మడి జిల్లా రికార్డు సృష్టించింది. కనీవినీ ఎరుగని రీతిలో కూలీలకు 'ఉపాధి' కల్పించిన ఘనతను సొంతం చేసుకుంది. గడిచిన నాలుగేళ్లలో జిల్లా చరిత్రలో గరిష్ట వర్షపాతం నమోదైంది. ఇబ్బడిముబ్బడిగా వ్యవసాయ పనులు వచ్చాయి. కానీ ఈ ఏడాది సగటు కంటే వర్షపాతం తక్కువ నమోదైంది. ఇలాంటి సందర్భాల్లో ఇతర నగరాలకు కూలీలు వలస వెళ్లకుండా సకాలంలో పని కల్పించగలిగారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో గడిచిన పది మాసాల్లో ఉపాధి హామీ కింద రమారమి రూ.500 కోట్లు వెచ్చించారు. ఇది చరిత్రలో రికార్డు వ్యయంగా చెప్పుకోవచ్చు.

సగటున 49 రోజుల పని

అనంతపురం జిల్లాలో ఒక్కో కుటుంబానికి సగటున 49 రోజుల పని కల్పించారు. అంతేకాదు 100 రోజుల పని పొందిన కుటుంబాలు 15 వేలు ఉన్నాయి. ఈ ఒక్క జిల్లాలోనే ఉపాధిలో భాగంగా రూ.349.15 కోట్లు వెచ్చించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలోనూ సగటున ఒక్కో కుటుంబానికి 46.77 రోజుల పని కల్పించారు. వంద రోజులు పని 9,231 కుటుంబాలు పొందాయి. ఈ జిల్లాలోనూ రూ.148.14 కోట్ల వ్యయం చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా పుట్టపర్తి నియోజకవర్గంలో 42 వేల మందికి పైగా కూలీలు ఉపాధి పొందగా, అనంతపురం జిల్లాలో అత్యధికంగా ఉరవకొండ నియోజకవర్గంలో 75వేల మంది పైచిలుకు కూలీలు ఉపాధి హామీ ద్వారా లబ్ధి పొందారు.

వలసల నియంత్రణ

అనంతపురం జిల్లా అంటేనే ఉపాధి కోసం జనం వలసలు పోయేవారు. 2014-19 మధ్య కాలంలో వర్షాభావంతో వ్యవసాయ పనులు లేక కర్ణాటకకు భారీగా కూలీలు వలస వెళ్లారు. ఇప్పుడు వలసలు గరిష్టంగా 80 శాతం తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఉరవకొండ, మడకశిర, గుంతకల్లు తదితర నియోజకవర్గాల నుంచి ఉపాధి కూలీలు భారీగా వెళ్లే పరిస్థితి ఉండేది. ఇప్పుడది పూర్తిగా నియంత్రణలోకి వచ్చింది. దీంతో పాటు రెండు జిల్లాల్లోనూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) భారీగా ఏర్పాటు చేయడంతో స్థానికంగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

అనంతపురం జిల్లాలో ఉపాధి పనులు..	
మొత్తం జాబ్ కార్డులు	2,59,919
కార్డుల్లో నమోదైన కూలీలు	4,63,234
ఉపాధి పొందిన కూలీలు	3,22,921
ఖర్చు చేసిన వ్యయం	రూ.349.15 కోట్లు
మొత్తం పని దినాలు	92,95,062
సగటున కుటుంబానికి పనులు	49.06 రోజులు

శ్రీసత్యసాయి జిల్లాలో ఉపాధి పనులు..	
మొత్తం జాబ్ కార్డులు	2,68,338
కార్డుల్లో నమోదైన కూలీలు	4,91,578
ఉపాధి పొందిన కూలీలు	2,35,751
ఖర్చు చేసిన వ్యయం	రూ.148.14 కోట్లు
మొత్తం పని దినాలు	65,81,080
సగటున కుటుంబానికి పనులు	46.77 రోజులు

వలస బాధలు తప్పాయి



జిల్లాలో ఉపాధి పనులు ఊపందుకోవటంతో వలస వెళ్లే బాధలు తప్పాయి. గతంలో ఎన్నడూ ఇంతలా ఉపాధి పనులు కల్పించలేదు. సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి ఉపాధి కూలీకి ఏడాదికి 100 రోజుల పని కల్పిస్తున్నారు. ఉపాధి హామీలో మా కుటుంబ సభ్యులకు రెండు జాబ్‌కార్డులున్నాయి. ఇద్దరం 100 రోజుల పని పూర్తి చేశాం.

– సాకమ్మ, ఉపాధి కూలీ, బుక్కపట్నం

అడిగినంత ఉపాధి



మేము అడినన్ని రోజులు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. అందువల్లే ఎక్కడా వలస అనే మాటే వినిపించడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వర్షాకాలంలోనూ ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించింది. కూలి డబ్బులు సకాలంలో ఇస్తుండటంతో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగడం లేదు. ఉపాధి కూలీల పట్ల సీఎం జగన్‌కు ఉన్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు.

– రమణమ్మ, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

భోజనం.. రుచికరం

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై సర్వత్రా హర్షం
- సరిగా లేదంటూ 'ఈనాడు'లో అసత్య కథనం
- భోజనం రుచికరంగా ఉందంటున్న విద్యార్థులు
- మెనూ పక్కాగా అమలు చేస్తున్నామంటున్న ఉపాధ్యాయులు


అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: సోమవారం నుంచి శుక్రవారం వరకూ రోజూ గుడ్డు... రోజుకో రకమైన రుచికరమైన వంట... శనివారం స్వీట్ పొంగల్.. మొత్తానికి ఆరు రోజులూ.. నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలతో కూడిన వంటకాలే! వీటికితోడు రోజూ రుచికరమైన రాగిజావ, మూడు రోజులు చిక్కీ... ఇదీ ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న 'జగనన్న గోరుముద్ద'. నిరుపేదలు, మధ్య తరగతి పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని జగన్ ప్రభుత్వం అందజేస్తుంటే... ఈనాడు రామోజీరావుకు కడుపులో మంట పుట్టినట్టుంది. ప్రభుత్వంపై అక్కసుతో తన పత్రికలో విషం చిమ్మేలా అసత్య కథనాన్ని ప్రచురింపజేశారు. వాస్తవాలను కప్పి పుచ్చి ప్రచురించిన కథనంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఏదైనా ఒక్క రోజూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తే అసలు విషయం తెలుస్తుందని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులూ అంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్రహ్మాండమైన మెనూని ప్రభుత్వ ఆదేశాల మేరకు పక్కాగా అమలు చేస్తున్నామంటూ ఉపాధ్యాయులూ సగర్వంగా అంటున్నారు.

కనిపించని మిగులు...

టీడీపీ హయాంలో మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. చాలీచాలని వంటకాలతో అర్ధాకలితో విద్యార్థులు అలమటించారు. అంతేకాక భోజనంలో నాణ్యత లోపించడంతో విద్యార్థులు తినలేక ప్లేట్లలోని అన్నం, నీళ్ల పప్పు తీసుకెళ్లి చెత్త కుప్ప పాలు చేసేవారు. జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత మధ్యాహ్న భోజన మెనులో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ఏజెన్సీ నిర్వాహకుల అవసరాలు ఎప్పటికప్పుడు తీరుస్తుండడంతో వారు సైతం నాణ్యత విషయంలో రాజీ పడకుండా తాజా కాయగూరలతో రుచికరమైన వంటకాలు సిద్ధం చేస్తున్నారు. దీంతో జిల్లాలోని ఆయా పాఠశాలల్లోని 92 శాతం మంది విద్యార్థులు జగనన్న గోరుముద్దను ఎంతో ఇష్టంగా తింటున్నారు. అన్నం వృథా కానివ్వడం లేదు. మిగులు అనేది లేకుండా సంతృప్తిగా విద్యార్థులు భోజనం చేస్తున్నారు.

తప్పిదాలకు తావులేదు

తరచూ ఇంట్లో సిద్ధం చేసుకునే వంటకాల్లోనే అప్పుడప్పుడు ఉప్పో... కారమో ఎక్కువ పడుతుండడం సహజం. అలాంటిది వందలాది మందికి భోజనం సిద్ధం చేసేటప్పుడు ఎప్పుడో ఒకసారి చిన్నపాటి తప్పిదం చోటు చేసుకోవడమూ అంతే సహజం. అయితే ఈ అంశాన్ని పట్టుకుని రోజూ ఇలాగే ఉంటోందని తప్పుడు కథనాలు ప్రచురించడంపై మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము చేస్తున్న వంటకాల్లో ఎన్నటికీ తప్పిదాలకు తావివ్వడం లేదని అంటున్నారు. కేవలం విద్యార్థులే కాకుండా తాము కూడా అదే భోజనాన్ని తింటున్నామని, కొన్నిసార్లు ఉపాధ్యాయులు సైతం భోజనం అడిగి పెట్టించుకుని మరీ తింటున్నారని పేర్కొన్నారు. తప్పుడు కథనాలు ప్రచురిస్తే నమ్మేందుకు ప్రజలు పిచ్చి వాళ్లు కాదనే విషయాన్ని ఈనాడు యాజమాన్యం గుర్తించాలని హితవు పలికారు.

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు	1,999
ప్రాథమికోన్నత పాఠశాలలు	202
ఉన్నత పాఠశాలలు	263
మొత్తం పాఠశాలలు	1,694
ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య	72,274
ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య	61,264
ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య	38,539
మొత్తం విద్యార్థులు	1,99,912
భోజనం చార్జీలు ఇలా...	
టీడీపీ హయాంలో...	
1-5 తరగతుల ఒక్కో విద్యార్థికి	రూ.4.13
6-10 తరగతుల ఒక్కో విద్యార్థికి	రూ.6.18
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..	
1-5 తరగతుల ఒక్కో విద్యార్థికి	రూ. 5.88
6-10 తరగతుల ఒక్కో విద్యార్థికి	రూ. 8.57

ఇంటి భోజనం చేసినట్లు ఉంటుంది



మా స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చాలా రుచిగా ఉంటుంది. ఇంట్లో తిన్నట్టే ఉంటుంది. రోజుకో రకం వంట పెడుతున్నారు. ఐదు రోజులు ఉడికించిన కోడిగుడ్డు ఇస్తారు. ఒక రోజు స్వీటు ఇస్తారు. రాగిజావ చాలా రుచిగా ఉంది. మా ఇంట్లో అయితే నేను ఎప్పుడూ రాగిజావ తాగలేదు.

– ఎస్.హాసిని, ఎం.వంద్రక్క పదో తరగతి, కేఎస్ఆర్ బాలికల పాఠశాల, అనంతపురం

రాగిజావ చాలా బాగుంది



రాగిజావ చాలా టేస్టీగా ఉంటుంది. నేనైతే ఒక గ్లాసు నిండా తాగుతా. మధ్యాహ్న భోజనం కూడా చాలా రుచిగా ఉంటుంది. గతంలో భోజనం రుచిగా లేదని పడేసేవాళ్లం. ఇంటి నుంచి తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. అన్నం వృథా చేయకుండా మొత్తం తినేస్తున్నాం. మా క్లాస్‌లో అందరమూ రోజూ జగనన్న గోరుముద్ద భోజనమే తింటున్నాం.

– బి.మహాలక్ష్మి, పదో తరగతి, కేఎస్ఆర్ బాలికల పాఠశాల

చాలా తృప్తిగా తింటున్నారు



'జగనన్న గోరుముద్ద' చాలా రుచిగా ఉంటోంది. పిల్లలు తృప్తిగా తింటున్నారు. గతంలో రుచి లేక చాలా సార్లు విద్యార్థులు అన్నం పడేసేవాళ్లు. మేము నచ్చచెప్పి చూశాం. భోజనం రుచిగా లేదని, నీళ్ల పప్పు బాగుండడం లేదని అనేవాళ్లు. ఇప్పుడా పరిస్థితి లేదు. స్కూల్‌కు రోజూ 1,250 నుంచి 1,300 మంది విద్యార్థినులు వస్తే వారిలో 1,050 మందికి పైగా ఇక్కడ సిద్ధం చేసే వంటకాలనే ఎంతో ఇష్టంగా తింటున్నారు.

– జి.నారాయణ హెచ్‌ఎం, కేఎస్ఆర్ బాలికల పాఠశాల, అనంతపురం

క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన శాంతమ్మ


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శాంత

హిందూపురం అర్బన్: హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త జె.శాంత బుధవారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో హిందూపురానికి చేరుకుని అక్కడి నాయకులను సమన్వయం చేసుకుని కార్యాచరణను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

వలస కూలీ దుర్మరణం


మృతుడు రుగ్నే

కనగానపల్లి: మండలంలోని దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో వలస కూలీ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మహారాష్ట్రకు చెందిన రుగ్నే (40) కొన్ని నెలల క్రితం బతుకు తెరువు కోసం కనగానపల్లి మండలం దాదులూరు గ్రామానికి వలస వచ్చాడు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న ఇటుకల బట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో వేగంగా దూసుకు వచ్చిన వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న కనగానపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

జనవాక్కు

రూ.3.26 లక్షలకు పైగా లబ్ధి



గతంలో ఎన్నడూ లేనంతగా సీఎం వైఎస్ జగన్ పాలనలో నాకు రూ.3.26 లక్షలకు పైగా లబ్ధి చేకూరింది. ఎలాంటి సిఫారసు లేకుండానే ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలను వలంటీర్లు అందజేస్తున్నారు. దీవెన పథకాలు, వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, పింఛన్ కానుక, రైతు భరోసా తదితర పథకాలతో రూ.3,26,220 లబ్ధి చేకూరింది. సీఎం వైఎస్ జగన్ మేలు ఎన్నటికీ మరువలేను. మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– విజయమ్మ, పెద్దపల్లి, మడకశిర మండలం

ఆర్థిక ఇబ్బందులు తీరాయి



గతంలో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. జగనన్న ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వివిధ సంక్షేమ పథకాలతో కుటుంబ ఆర్థిక పరిస్థితి గాడిన పడింది. మా ఇద్దరు పిల్లలూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. మా ఆయనకు ఏటా రైతు భరోసా కింద రూ.13,500 ఇస్తున్నారు. దీంతో పంటల సాగుకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేయాల్సిన బాధ తప్పింది. పేదలను లక్షాధికారులను చేసిన సీఎం వైఎస్ జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– కె.అరుణ, కునుకుంట్ల, తాడిమర్రి

కుటుంబాన్ని ఆదుకున్నారు



నాకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. అందరమూ మా అమ్మతో పాటు కలిసే ఉంటున్నాం. హమాలీ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. పెద్ద కుమారుడు యోగేష్ పుట్టుక తోనే వైకల్యంతో బాధపడుతున్నాడు. మిగిలిన ఇద్దరి చదువులు, కుటుంబపోషణకు నా సంపాదన ఏ మాత్రం సరిపోక నానా ఇబ్బందులు పడేవాళ్లం. పెద్దోడికి వికలాంగుల కోటా కింద పింఛన్ కోసం గత ప్రభుత్వ హయాంలో చాలా ప్రయత్నాలు చేశా. ఫలితం దక్కలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎవరి సిఫారసు లేకుండానే నా కుమారుడికి నెలకు రూ.5 వేల పింఛన్ అందుతోంది. మా అమ్మ చౌడమ్మకు వితంతు పింఛన్‌ను మంజూరు చేశారు. అలాగే వైఎస్సార్ ఆసరా పథకం కింద మా అమ్మకు ఏటా రూ.18,750 ఆర్థిక సాయం అందుతోంది. అమ్మ ఒడి పథకం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పిల్లలను బాగా చదివించుకుంటున్నాం. మా కుటుంబాన్ని ఆదుకున్న సీఎం వైఎస్ జగనన్నకు మేమెంతో రుణపడ్డాం.

– నరసింహప్ప, 90 ఇండ్ల ఎస్సీ కాలనీ, పరిగి

భార్య ప్రవర్తన నచ్చక భర్త ఆత్మహత్య

పావగడ: తన భార్య ప్రవర్తన నచ్చక మనస్థాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడరహళ్లికి చెందిన చంద్రశేఖర్ (28)కు సమీపంలోని గుమ్మఘట్ట గ్రామానికి చెందిన షర్మిలతో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా తన భార్య చెప్పాపెట్టకుండా పుట్టింటికి పదేపదే వెళుతుండడాన్ని గమనించి చంద్రశేఖర్ ఆమెను వారించాడు. అయినా ఆమె వినలేదు. కొన్ని రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో చంద్రశేఖర్ కూడా అక్కడికెళ్లి విచారించాడు. అయితే ఆమె పుట్టింట్లో లేదని, శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం కేతగానిచెరువు గ్రామంలో ఉన్నట్లుగా తెలుసుకుని అక్కడకు చేరుకున్నాడు. అక్కడ మరో వ్యక్తితో ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లుగా తెలుసుకున్న ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. తన భార్య ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు పరిపరి విధాలుగా నచ్చచెప్పాడు. అయినా ఆమె వినకపోవడంతో మనస్తాపం చెందిన చంద్రశేఖర్ మంగళవారం రాత్రి తన ఇంట్లోనే భార్య చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రామాంజినప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ గిరీష్ తెలిపారు.

యోగా టీచర్‌పై పోక్సో కేసు నమోదు

గుత్తి రూరల్: మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పల్లపోతుల అనిల్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాలు... వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి కొంత కాలంగా గుత్తి మండలంలోని ఓ జెడ్పీహెచ్ఎస్‌లో యోగా టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బుద్ధ యోగా సొసైటీ పరిధిలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఆయన గత డిసెంబర్ 25న తాను పనిచేస్తున్న పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినిని మాయమాటలతో లోబర్చుకుని పిలుచుకెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లోని ఐదు తులాల బంగారు నగలతో పాటు ఆమె వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు... ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్న ప్రాంతాన్ని పసిగట్టి మంగళవారం రాత్రి అక్కడకు చేరుకుని ఇద్దరినీ పిలుచుకుని గుత్తికి వచ్చారు. విచారణ అనంతరం బుధవారం రాత్రి బాధితురాలి ఫిర్యాదు మేరకు అనిల్ కుమార్‌రెడ్డిపై కిడ్నాప్, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కాగా, సదరు యోగా టీచర్‌పై వైఎస్సార్ జిల్లాలోనూ పోక్సో కేసుతో పాటు మరో రెండు కేసులు ఉన్నట్లు సమాచారం.

ఘనంగా ముగిసిన ఇస్తెమా


ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు (చిత్రంలో) ఎమ్మెల్యే డా.సిద్దారెడ్డి

గాండ్లపెంట: మండల కేంద్రంలో రెండు రోజులుగా సాగుతున్న 'ఇస్తెమా' బుధవారం ఘనంగా ముగిసింది. వేలాది మంది మైనార్టీలు తరలివచ్చారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా జమాత్ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలోల్లో ఎమ్మెల్యే సిద్దారెడ్డి, కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ పాల్గొన్నారు. మైనార్టీలతో కలిసి దువాలో పాలుపంచుకున్నారు.

నేడు రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ క్రీడోత్సవాలు

అనంతపురం: పాలిటెక్నిక్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు గురువారం అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు క్రీడోత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్, అనంతపురం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారని, ఈ నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.

వేరుశనగ వ్యాపారి పరారీ

- రూ.కోటికి పైగా రైతులకు బకాయి

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన హుస్సేన్ అనే వేరుశనగ వ్యాపారి పరారయ్యారు. రూ.కోటి వరకు డబ్బు ఇవ్వకుండా వ్యాపారి అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో రైతులు బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. హుస్సేన్ ఇటీవల కంబదూరు, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప మండలాల్లో రైతుల వద్ద నుంచి వేరుశనగ కొనుగోలు చేశాడు. డబ్బు చెల్లించడానికి పది రోజుల సమయం తీసుకున్నాడు. రెండు నెలలు కావస్తున్నా నగదు ఇవ్వకపోవడం, సెల్‌ఫోన్ పనిచేయకుండాపోవడంతో రైతులు ఏమి చేయాలో దిక్కు తోచలేదు. పరారీలో ఉన్న వ్యాపారిని పట్టుకొచ్చి, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేస్తామని సీఐ హరినాథ్ రైతులకు హామీ ఇచ్చారు.

రెండు దుకాణాల్లో చోరీ


దుకాణంలో పైకప్పు తొలగించిన దొంగలు

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రియాంకనగర్‌లోని రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... ప్రియాంకనగర్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న శ్రీలక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చొరబడిన దుండగులు రూ.60 వేలు నగదు, రూ.1.50 లోలు విలువ చేసే విద్యుత్ వైర్ల కట్టలు, రూ.50 వేలకు పైగా విలువ చేసే ఫ్యాన్లు, గీజర్లను అపహరించారు. అనంతరం పక్కనే ఉన్న మొబైల్ షాపు రేకులు తొలగించి కంప్యూటర్, నాలుగు మొబైల్ ఫోన్లు దాదాపు రూ.40 వేలు విలువైన ఇతర సామగ్రి అపహరించారు. బుధవారం ఉదయం దుకాణాలు తెరిచిన యజమానులు నరేష్‌రెడ్డి, రామ్‌కుమార్ షెడ్ పైన ఉన్న రేకులు తొలగించిన విషయం గమనించి చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకుని సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పాము కాటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి


మృతుడు సిద్దప్ప

గుడిబండ: మండలంలోని సీసీ గిరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బొగ్గు సిద్దప్ప (44) పాము కాటుతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. వివరాలు... మంగళవారం సాయంత్రం వరకూ తన పొలంలో పనిచేసిన సిద్దప్ప రాత్రి ఇంటికి చేరుకుని భోజనం చేసి నిద్రించారు. అప్పటికే ఇంట్లోకి చేరుకున్న పాము సిద్దప్ప కాలిపై కాటు వేయడంతో అప్రమత్తమైన కుటుంబసభ్యులు వెంటనే ప్రైవేట్ వాహనంలో మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్ణాటకలోని తుమకూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో అపస్మారక స్థితికి చేరుకోవడంతో వెంటనే మధుగిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య తేజస్విని, కుమారుడు యంజారప్ప, కుమార్తె శిల్ప ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, సిద్దప్ప మృతి విషయం తెలుసుకున్న రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, స్థానిక సర్పంచ్ డీఎల్ యంజారేగౌడు తదితరులు సీసీ గిరి గ్రామానికి చేరుకుని సిద్దప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మడకశిర మున్సిపల్ కమిషనర్‌కు మెమో

మడకశిర: మడకశిర మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావుకు పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ మెమో జారీ చేశారు. నియోజకవర్గ ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సబ్ కలెక్టర్ అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్షకు ఐదు మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ఎన్నికల విభాగం అధికారులను ఆహ్వానించారు. అయితే సమావేశానికి మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు సబ్ కలెక్టర్ మెమో జారీ చేశారు. గైర్హాజరుకు సహేతుకమైన కారణాలను నిర్ణీత గడువులోపు తెలపాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరంతర ప్రక్రియగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పెనుకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. పెనుకొండలోని సెంట్రల్ స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఆరు నెలలకోసారి సచివాలయాల పరిధిలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పాత రోగులకే కాక కొత్త రోగులకూ చికిత్స అందజేస్తారన్నారు. ఇటీవల ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచిందని, ఇందుకు సంబంధించిన కార్డులను త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెనుకొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బొలెరో నుంచి కిందపడి యువకుడి మృతి

ఎన్పీకుంట: కదిరి పట్టణంలోని గజ్జలరెడ్డిపల్లి క్వార్టర్స్‌కు చెందిన రోషన్‌జమీర్ (17) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రోషన్‌జమీర్ తన సన్నిహితులతో కలిసి అన్నమయ్య జిల్లా రాయచోటి పరిసర ప్రాంతంలో జరుగుతున్న ఉరుసు ఉత్సవానికి వెళ్లాడు. వ్యాపారనిమిత్తం చిన్నపిల్లల ఆటవస్తువులు తీసుకొని బొలెరో పికప్ వాహనంలో బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో బయలుదేరాడు. ఎన్పీ కుంట మండల పరిధిలోని బందారుచెట్లపల్లి సమీపంలో అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనం ద్వారా కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స ఫలించక మృతి చెందాడని ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.